నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, సోమవారం 10 ఫిబ్రవరి 2025 HYDERABAD

## దిశా నిర్దేశం



తెలంగాణ భవన్‌లో ఆదివారం బీసీ ముఖ్యనేతలతో జరిగిన సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యేలు వివేకానంద్, తలసాని శ్రీనివాస్, ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.





## తాను మరణించి.. పలువురి జీవితాల్లో వెలుగు..

శేరిలింగంపల్లి/ఖైరతాబాద్: తాను మరణించి..పలువురి జీవితాల్లో వెలుగులు నింపారో వైద్యురాలు. డాక్టర్ భూమికారెడ్డి ( 24) ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్లో హౌస్ సర్జన్ గా వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ నెల 1న తెల్లవారుజామున కారులో వెళ్తూ.. ప్రమాదానికి గురయ్యారు. కాంటినెంటల్ వైద్యశాలలో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యారు. భూమిక కుటుంబ సభ్యులను కలిసిన జీవన్ దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా, వారు పెద్దమనుసుతో అంగీకరించారు. దీంతో భూమికారెడ్డి శరీరం నుంచి కాలేయం, గుండె, ఒక ఊపిరితిత్తి, రెండు మూత్రపిండాలను సేకరించారు. అవయవదానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను వైద్యులు అభినందించారు.



డాక్టర్ భూమికారెడ్డి(ఫైల్)



## ఫార్మా సిటీ ఉన్నట్టా.. లేనట్టా ..

### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 9 : మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరులో ఫార్మ సిటీ ఉన్నట్లా లేనట్లా అనేది ప్రభుత్వం స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రం గూడ గడ్డం ఇంక్లేవ్ కాలనీలో ఆదివారం ఆమె సీసీ కెమెరాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శాంతి భద్రతలు పూర్తిగా అదుపుతప్పయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం 14000 ఎకరాలను సేకరించి పెట్టిందన్నారు. ఫార్మాసిటీని కాదని ఫోర్త్ సిటీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నదని, ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలనుకుంటున్న చోటనే ఫోర్త్ సిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారన్నారు. భూమి ఉన్న తర్వాత భూమి సేకరించాల్సిన అవసరం ఏముందన్నారు. కొడంగల్ లో మరో వెయ్యి ఎకరాలు ఎందుకోసం తీసుకుంటున్నారో తెలియదన్నారు. కోడంగల్ రైతుల సమస్య పైన ఇప్పటివరకు ముఖ్యమంత్రి పిలిచి మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని అడిగి నిధులు తీసుకు వచ్చే దమ్ము ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రామిరెడ్డి, ఏనుగు రాంరెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి, సాయి కిరణ్ రెడ్డి, అశోక్, ముత్యాల కృష్ణ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ @ 32.4 డిగ్రీలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో ఉక్కపోత మొదలైంది. మొన్నటి వరకు పగటి ఉష్ణోగ్రతలు పెరగగా రెండు మూడు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. అదే సమయంలో రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 32.4 , కనిష్ఠం 20.1 డిగ్రీలు, గాలిలో తేమ 46శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.



# చెదరగొట్టాలి... మళ్లీ పేర్చాలి..!

- నగరాభివృద్ధిపై రేవంత్ సర్కారు విచిత్ర క్రీడ
- ఏడాది దాటినా ఇప్పటికీ మొదలుకాని తట్టెడు పని
- రూ.80వేల కోట్లు ప్రతిపాదనలతో నిత్యం హడావిడి
- కేసీఆర్ హయాంలోని ప్రతిపాదనలతోనే కొత్త పేర్లతో ప్రాజెక్టులు
- నయాపైసా విదిల్చలేని స్థితిలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, జలమండలి




ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా నివాసాలు కోల్పోతున్న తమకు భూమితో పాటు ఇంటికి నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బొల్లారం నుంచి లక్డావాలా బస్టాప్ వరకు ర్యాలీ తీసిన స్థానికులు. – బొల్లారం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): సాధారణంగా పిల్లలు ఆడుకునేటప్పుడు రాళ్లను గుట్టగా పేరుస్తారు... అన్నీ పేర్చిన తర్వాత వాటిని చెదరగొడతారు! మళ్లీ తిరిగి పేరుస్తారు!! వాళ్లకు అదో సరదా. గతేడాది కాలంగా హైదరాబాద్ మహా నగరాభివృద్ధిపై రేవంత్ సర్కారు తీరు ఇట్లనే కనిపిస్తున్నది. ఏ విభాగాన్ని పట్టుకున్నా... తొలుత దానికి సంబంధించి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూపొందించి, అమలైన ప్రతిపాదనలను చెదరగొడుతున్నారు... కొన్ని రద్దు చేస్తున్నారు... తిరిగి పాత పనులతోనే కొత్త ప్రతిపాదనలు రూపొందించి నూతనంగా నామకరణం చేస్తున్నారు. తాజాగా రమారమి రూ.80–90 వేల కోట్ల ప్రతిపాదనలతో సీఎం సహా పలు విభాగాల అధికారుల హడావిడి మళ్లీ మొదలుపెట్టారు. ఇందులో కేంద్రం వాటాగా వేల కోట్లను ప్రతిపాదించినా ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో చిల్లిగవ్వ కేటాయింపు లేదు. మరోవైపు జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, జలమండలి ఖజానాలు కూడా ఖాళీగా ఉండటంతో నిధుల సమీకరణ అనేది మిలయన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

### కొత్త సీసాలో పాత సారానే...

- దశాబ్దాల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ నగరంలోని రవాణా వ్యవస్థలో వేళ్ల మీద లెక్కించేంత మౌలిక సదుపాయాలు వచ్చాయి. కానీ గత పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన మౌలిక సదుపాయాలు జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల ప్రశంసలను పొందాయి.

వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌ఆర్‌డీపీ) మొదటి దశ కింద సుమారు రూ.6800 కోట్లతో చేపట్టిన పనుల్లో దాదాపు 35కు పైగా ఫ్లైఓవర్లు, ఆర్వోబీలు, ఆర్‌యూబీలు, తీగల వంతెన... ఇలా ఎన్నో అందుబాటులోకి వచ్చాయి. ఇంకోవైపు హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో వందల కిలోమీటర్ల లింకు, కొత్త రోడ్ల నిర్మాణంతో నగరం నలుమూలలా ముఖచిత్రమే మారిపోయింది. ఈ నేపథ్యంలో ఎస్‌ఆర్‌డీపీ రెండో దశ కింద కూడా కేసీఆర్ ప్రభుత్వం వేలాది కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. కానీ అధికారంలో వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు ఒత్తిడిని అధిగమించేందుకు రూ.20వేల కోట్ల నిధుల సమీకరణ చేయాలనే దానిపై కన్సెల్టెంట్లతో అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతున్నది.

### సుంకిశాలను ముంచి...

రూ.1006 కోట్లతో కొందపోచమ్మ సాగర్ నుంచి నగరానికి పది టీఎంసీల గోదావరిజలాలు వచ్చేలా కేసీఆర్ ప్రభుత్వం డిజైన్ రూపొందిస్తే... రేవంత్ సర్కారు దాని డిజైన్ మార్చి అదనంగా 26 కిలోమీటర్ల పైప్‌లైన్ పెంచి మల్లన్నసాగర్ నుంచి నీటి సేకరణకు నిర్ణయించింది. తద్వారా ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.7300 కోట్లకు ఎగబాకింది.

### ఎలివేటెడ్ ప్రాజెక్టు...

ప్యారడైజ్–డెయిరీ ఫాం రోడ్డు (5.8 కిలోమీటర్లు), జేబీఎస్ – తూంకుంట (18 కిలోమీటర్లు) ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును రూపొందించారు. కానీ కేంద్రంలోని మోదీ సర్కారు రక్షణ భూములకు క్లియరెన్స్ ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా తాత్సారం చేసింది. గతేడాది జనవరి 24న రక్షణ శాఖ నుంచి అనుమతులు వచ్చాయి. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా హడావిడిగా ఈ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు పనులు మొదలుపెట్టలేకపోయారు.

### కేబీఆర్ పార్కు దాటేదెలా?

కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ చిక్కుముళ్లు లేకుండా ప్రయాణించేందుకు కేసీఆర్ ప్రభుత్వమే గతంలో ఎస్‌ఆర్‌డీపీ కింద ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కానీ పర్యావరణ అనుమతుల చిక్కుతో పాటు స్థానికులు కూడా వ్యతిరేకించడంతో ఆ ప్రాజెక్టు ముందుకు కదలలేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొన్నిరోజుల కిందట టేడు చొప్పున అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లను నిర్మించేందుకు నిర్ణయించింది. జీహెచ్‌ఎంసీ భూసేకరణ పూర్తి చేస్తే రూ.1090 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టాలని అనుకున్నారు. అయితే భూసేకరణకు సర్వే మొదలైంది. భూసేకరణ పూర్తి చేయడం ఒక చిక్కయితే... గతంలో నష్టపరిహారం కింద జీహెచ్‌ఎంసీ టీడీఆర్‌లు (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) ఇచ్చేది. కానీ ఏడాది కాలంగా రియల్, నిర్మాణ రంగాలు దెబ్బతినడంతో టీడీఆర్‌లకు డిమాండు తగ్గింది. ఎలివేటెడ్ కారిడార్‌లోనే బాధితులు టీడీఆర్‌లకు విముఖత చూపడంతో హెచ్‌ఎండీఏ నగదు ఇచ్చేందుకు అంగీకరించింది. దీంతో ఈ ప్రాజెక్టులో జీహెచ్‌ఎంసీ నగదు ఇవ్వాలంటే అది సాధ్యమేనా? జీతభత్యాలు, నిర్వహణకే సతమతం అవుతున్న జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ.వెయ్యి కోట్ల బకాయిలనే ఇవ్వలేకపోతున్నది.

### మీరాలం వంతెన చేపట్టేదెవరు?

మీరాలం చెరువు అభివృద్ధితో పాటు దుర్గం చెరువులా తీగల వంతెన ప్రాజెక్టు ప్రతిపాదనలు కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఉన్నాయి. దీనిపై ఇటీవల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హడావిడి మొదలుపెట్టింది. అయితే దీనిని ఏ విభాగం చేపడుతుందనే దానిపై అధికారుల్లోనే అయోమయం నెలకొంది.

### బాండ్లపైనే హెచ్‌ఎండీఏ ఆశలు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నెలకు రూ.150 కోట్ల ఆదాయంతో వేలాది కోట్ల అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యమైన హెచ్‌ఎండీఏ ఇప్పుడు నిధులులేక విలవిలలాడుతున్నది. రియల్, నిర్మాణ రంగం పడిపోయి ఆదాయం నెలకు రూ.60–70 కోట్లకు మించకపోవడంతో అది నిర్వహణకే సరిపోతున్నది.

### మెట్రో పయనమెటు..?

హైదరాబాద్ నగరంలో మెట్రో ప్రాముఖ్యత ఎంతో ఉంది. ఈ నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వం గత పదేండ్లలో రోడ్డు నెట్‌వర్క్‌ను గణనీయంగా మెరుగుపరిచిన తర్వాత మెట్రోపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా 2023 ఆగస్టులో జరిగిన మంత్రవర్గ సమావేశంలో నూ.60వేల కోట్లతో 309 కిలోమీటర్ల ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. రానున్న 2–3 సంవత్సరాల్లో వీటిని పూర్తి చేయాలనే లక్ష్యాన్ని ఎంచుకుంది. అప్పటికే రాయదుర్గం–శంషాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రోను ప్రారంభించింది. జీఎమ్మార్, హెచ్‌ఎండీఏ, ఎల్‌అండ్‌టీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా రూ.6250 కోట్లతో 31 కిలోమీటర్ల చేపట్టిన ఎయిర్‌పోర్టు మెట్రో సర్వే కూడా మొదలైంది.

- కానీ 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రోజుల వ్యవధిలోనే రాయదుర్గం ఎయిర్‌పోర్టు మెట్రోను రద్దు చేసింది. దీంతో దానిపై అప్పటివరకు వెచ్చించిన కోట్ల రూపాయలు వృథా అయ్యాయి. కేసీఆర్ ప్రభుత్వం రూపొందించిన ప్రతిపాదనలు ఉండొద్దనే ఆలోచనతో రేవంత్ సర్కారు మళ్లీ మెట్రో ప్రతిపాదనలపై మల్లగుల్లాలు మొదలుపెట్టింది.
- ఎట్టకేలకు రెండో దశలో నాలుగు మార్గాల్లో 68.9 కిలోమీటర్ల మెట్రోకు రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్ రూపొందించి, కేంద్రానికి పంపింది. ఇప్పటివరకు కేంద్రంలో డీపీఆర్ పరిశీలననే పూర్తి కాలేదు. పైగా మోదీ సర్కారు ఇటీవలి బడ్జెట్‌లో ఈ ఊసే ఎత్తకపోవడంతో కేంద్రం నుంచి వస్తుందనుకున్న రూ.4,368 కోట్లపై ఆశలు ఆవిరయ్యాయి. పైగా కేంద్రం సాంకేతిక అనుమతితో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న రూ.11689 కోట్లు (48 శాతం ) రుణానికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉంది. రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రోను గత ఒప్పందం మేరకు చేపట్టేందుకు ఎల్‌అండ్‌టీ నిరాకరించడంతో రూ.2741 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వమే మొదలుపెట్టింది. ఇప్పుడది భూసేకరణ దశలోనే ఉంది. కేంద్రం మొండిచేయి చూపడం, పీపీపీకి ఎల్‌అండ్‌టీ నిరాకరించడంతో రాష్ట్రమే మొత్తం భరించాల్సి ఉంది.
- శంషాబాద్ నుంచి ఫోర్త్ సిటీ మెట్రో అంటూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరో 40.318 కిలోమీటర్ల ప్రతిపాదనలు, మేడ్చల్ మెట్రో కింద ఇంకో 45 కిలోమీటర్ల (జేబీఎస్–శామీర్‌పేట, జేబీఎస్–మేడ్చల్) ప్రతిపాదనలను తెరపైకి తెచ్చింది. రెండో దశ అంచనాల ప్రకారం లెక్కిస్తే కిలోమీటరకు రూ.318 కోట్లు అవుతున్నందున... మూడో దశలోని 85.318 కిలోమీటర్లకు రూ.25,541 కోట్ల వరకు అవుతుంది. అంటే కేవలం మెట్రో ప్రాజెక్టులపైనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.50వేల కోట్ల వరకు ప్రతిపాదనలను ముందు పెట్టుకుంది. ఏడాది గడిచినప్పటికీ ఇప్పటివరకైతే పాతబస్తీ మెట్రో భూసేకరణ మినహా ఎక్కడా కించిత్తు కదలిక లేదు.



బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న పలువురు నాయకులు

## కాంగ్రెస్ సర్కారువి ఉత్తుత్తి హామీలు

### బీఆర్‌ఎస్ నేత కార్తిక్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 9: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు నానా రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి అన్నారు. ఉత్తుత్తి హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు కష్టాలు మొదలయ్యాయన్నారు. దీనిని ప్రజలు తొందరగా అర్థం చేసుకోని కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమవుతున్నారన్నారు. త్వరలోనే రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు రాబోతున్నాయన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత కష్టపడి పని చేయాలన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా..బీఆర్‌ఎస్ సిద్ధంగా ఉండి అన్ని సీట్లను కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్‌లో అందరికీ సముచిత స్థానం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈశ్వర్, వై.వెంకటేశ్, రాముయాదవ్, రఘుయాదవ్, వెంకటేశ్, సోమ శ్రీనివాస్, అరుణ్‌ముదిరాజ్, డి.రమేశ్, జి.రాజు, మంచర్ల చిరంజీవి, సురేశ్ ముదిరాజ్, గంజి రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# టీఏల చేతిలో హెచ్‌ఎండీఏ ప్రణాళికలు

## ఇప్పటికీ సందిగ్ధంగానే వారి పనివిధానం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9(నమస్తే తెలంగాణ): హెచ్‌ఎండీఏ ప్రణాళికలను పట్టాలెక్కించేందుకు నియమించిన ట్రాన్సాక్షన్ అడ్వయిజరీలు పనిచేస్తున్నాయా? లేదా అనేది సందిగ్ధంలో ఉంది. హెచ్‌ఎండీఏ చేపట్టే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల ప్రణాళికల బాధ్యతలను సలహాదారులకు అప్పగించారు. ఇప్పటికే రెండు ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులతోపాటు, మీరాలం లేక్ కేబుల్ బ్రిడ్జి వంటి ప్రాజెక్టుల టెండర్ల విధానం, ఆర్థిక పరమైన అంశాలపై అధ్యయనం చేసేందుకు గతంలోనే టెండర్లను హెచ్‌ఎండీఏ పిలిచింది. అయితే ఇప్పటికే వాటి నియామాకం పూర్తి కాగా, అసలు సలహాదారు సంస్థలు ఏం చేస్తాయనేది గందరగోళంగా మారింది.

### టీఏ చెబితేనే..

హెచ్‌ఎండీఏ పనితీరులో మార్పు వచ్చింది. గతంలో మాదిరి ప్రణాళికలు రూపొందించి, ఆచరణలో పెట్టే విధానం నుంచి, ఎన్నడూ లేని విధంగా ట్రాన్సాక్షన్ అడ్వయిజరీ(టీఏ) చెబితే గానీ పనులు చేపట్టలేని స్థాయికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చింది. సమగ్ర విధివిధానాలపై స్వయంగా పరిశీలన చేయాల్సిన అవసరం లేకుండానే... వడ్డించిన విస్తరి తరహా పని విధానాన్ని హెచ్‌ఎండీఏ పరిధిలో ప్రవేశపెట్టింది. ఇలా కీలకమైన ప్రాజెక్టుల విషయంలో టీఏల నియామకం చేసుకుని ప్రణాళికల అధ్యయనం పేరిట కాలయాపన చేస్తోంది.

### ఎన్నో ప్రాజెక్టులకు..

హైదరాబాద్ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే హెచ్‌ఎండీఏకు ట్రాన్సాక్షన్ అడ్వయిజరీ ద్వారా పనిలో మార్పులు వచ్చాయి. హెచ్‌ఎండీఏ ఇప్పటివరకు నగరానికి తలమానికమైన ఎన్నో ప్రాజెక్టులను ఎలాంటి టీఏలు లేకుండా నిర్మాణం చేసి, పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నది. ప్రాజెక్టు ఖర్చు, నిర్మాణ వ్యయం, రెవెన్యూ వంటి విషయాలను సొంతంగా అధ్యయనం చేసే హెచ్‌ఎండీఏ ఆ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో... అసలు టీఏలు ఏం నివేదిస్తాయనేది ఇప్పుడు సంబంధిత విభాగాధిపతులను కూడా గందరగోళానికి గురి చేస్తోంది. హెచ్‌ఎండీఏ మూడు ప్రాజెక్టుల కోసం టీఏల నియామకానికి చేపట్టగా... ఇందులో ఎలివేటెడ్ కారిడార్, మీరాలం కేబుల్ బ్రిడ్జి పనులను అధ్యయనం చేసే బాధ్యతలను ఆయా ఏజెన్సీలు తీసుకున్నాయి. కానీ ఇప్పటివరకు ఎలాంటి సర్వే చేస్తుంది. ఏ విషయాలను పరిగణనలోకి తీసుకుంటుంది. అధ్యయనానికి ఎలాంటి ప్రామాణికత ఉందనే విషయాలు మాత్రం గోప్యంగానే ఉన్నాయి.

### ఒరిగేదేమిటీ...?

పౌరులకు మెరుగైన మౌలిక వసతులను కల్పించాల్సిన అంశంలో ఆదాయ మార్గాలు, నిర్మాణ వ్యయం వంటి అంశాలపై ఎలాంటి అధ్యయనం చేయాల్సిన పని లేదని నిబంధనలే చెబుతున్నాయి. కానీ వాటిపై అధ్యయనం చేయడానికి టీఏలను నియమించుకోవడం ఇప్పుడు హెచ్‌ఎండీఏ వర్గాల్లోనే చర్చనీయాంశంగా మారింది. ఆర్థికపరమైన, ఇతర అంశాల్లో సాధ్యాసాధ్యాలను అంచనా వేసే బాధ్యతలను నిర్వర్తించే టీఏలు... చెప్పిందే హెచ్‌ఎండీఏ తూచా తప్పకుండా అమలు చేయాల్సి ఉండటంతో... ఆ సంస్థ ప్రజా ఉపయోగాలను ఎంత వరకు పరిగణనలోకి తీసుకుంటుందనేది ప్రశ్నార్థకంగా మారింది. నిర్మాణానికి ప్రధానమైన ఆర్థిక వనరులు, వినియోగం, నిర్వహణ భారం వంటి రెవెన్యూ పరమైన అంశాలపై అంచనా వేస్తూ టీఏలూ సలహాలిస్తారని చెబుతున్నా...హెచ్‌ఎండీఏకు ఆర్థిక భారమే తప్పా... ఆదాయం మిగిలే అవకాశం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి. తాజాగా ట్యాంక్ బండ్ పరిసరాల్లోనూ అధ్యయనం చేసే బాధ్యతలను ట్రాన్సాక్షన్ అడ్వయిజరీలకు అప్పగించేందుకు హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టింది.